# అక్కా కరుణ

నేను అనుకుంటూనే వున్నా! ఎప్పుడో ఒకప్పుడు కరుణ నుంచి కబురు వస్తుందని!

ఆవేళ ఎందుకో పొద్దుట్నించీ కుడి కన్ను అలా అదురుతున్నది అదురుతున్నట్లే వుంది.

ఫోన్ మ్రోగింది ఆ రోజు మధ్యాహ్నం.

'హలో! – హలో! – హలో!... 'ఎవరండీ!'


'నేనే...'

'నేనే అంటే...!'

'అంటే... నా గొంతు గుర్తుపట్టలేదా? నేనండీ...!'

'నేను... నేనంటే... నాకెలా తెలుస్తుందండీ!'

'అబ్బా! గుర్తు చేసుకోండి!'



సాత్‌హిల్స్

'ఏం గుర్తు చేసుకోను?...'

నేను... నేను... కరుణనండీ!'

'ఆ... ఆ... ఓహో కరుణగారా? ఎంత కాలమైంది మిమ్మల్నిచూసి... మాటవిని... చాలాకాలమైందిగా... గుర్తుపట్టలేక పోయాను. ఏమీ అనుకోకండి!... ఇంతకీ ఎలావున్నారు? ఏమిటి విశేషాలు...?' ఉక్కిరి బిక్కిరవుతూ ఫోన్లోనే ప్రశ్నల వర్షం కురిపించా.

'ఆ... ఏంలేదు... ఒక్కసారి... మీ దంపతులు... మా యింటికి వచ్చి దర్శనం ఇస్తారని ఆశిస్తూ... త్వరగారమ్మని కోరుతూ...' దగ్గు తెరలతో ఫోన్ హఠాత్తుగా కట్ అయిపోయింది.

ఎప్పటి మాట... ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రితం ముప్పైమంది కలిసి దేశయాత్రకు బయలుదేరాం! అందరం ఇంచుమించు ఏభైయేళ్లు దాటిన వాళ్ళమే! పుణ్యక్షేత్రాలు, తీర్థాలూ దర్శించాలనే కోరిక! ఆ రీతిగా కరుణగారు మాతో యాత్రకు వచ్చారు. ఎక్కడో కోనసీమలోని పల్లెటూరు... బస్తీ మొహంచూడని అమ్మాయి. నా స్నేహితుని కుటుంబం రావలసివుండి, అవాంతర కారణాలతో రాలేక వారింటి ప్రక్కవున్న ఈ కరుణగారిని నా దగ్గర దింపి, యాత్రలు చేయించమని కోరి మరీ వెళ్ళాడు.


కరుణగారు నడిప్రాయంలో వున్న వితంతువు. నల్లగా వున్నా మొహం కళగానే వుంటుంది. అయితే ఛాదస్తం మాత్రం ఎక్కువ.

కంచు మరచెంబు... ట్రంకుపెట్టె... మెడలో తులసీ పేర్ల తావళం శ్వేతాంబరధారిణి... ఎప్పుడూ నవ్వుతూవుండే మొహం! ఎవ్వరినీ నొప్పించని మాటతీరు... తన డబ్బే తనకు ఖర్చుపెట్టాలనే నిజాయితీ స్వభావం! అదెంతటి నిజాయితీ అంటే కుడి చేత్తో యిచ్చిన వస్తువుని మరలా కుడి చేత్తోనే తీసుకోవాలనే భావన! యిప్పటికీ యిలాంటి వాళ్లున్నారా? అని నేను విభ్రాంతిపడక తప్పలేదు.

యాత్రలో ఒకసారి ఒక దేవాలయం చూస్తూ ఆవిడ తప్పిపోయింది. నేనావిణ్ణి వెదుకుతూ ఆ వూళ్ళో ఆగిపోయి, తక్కిన యాత్ర బృందాన్ని యాత్రను కొనసాగించమని పంపేసేను. చివరికి ఆవిణ్ణి వెతికిపట్టుకుని, పూరీ నుంచి కలకత్తా చేరుకుని, మా యాత్రీకులతో కలుసుకున్నాను. అప్పటికే ఆవిడ కళ్లు రెండూ చెరువులైపోయాయి. గద్గద కంఠంతో... మీరు రాకపోతే నా బ్రతుకేమై పోయేదో కదా! అంటూ శోకమూర్తి అయిపోయింది. అప్పట్నించీ నా వెంటే అంటిపెట్టుకొని యాత్ర పూర్తి చేసుకున్నారు.

స్త్రీ సహజమైన అసూయకు నా శ్రీమతి ఏమీ మినహాయింపుకాదు! 'చాల్లెండి సంబడాలు... ఈ వయస్సులో... ఎవరైనా నవ్వుతారైనా అనుకోకుండా... ఆ ముక్కూ మొహం తెలియని ఆవిడ కోసం ఆత్రపడడం ఏమిటీ... ఆ వెంటేసుకు తిరగడాలేమిటి?' అంటూ నన్ను సూటీపోటీ మాటలతో వేధించేది. పరోపకారం మానవధర్మం అనే దృక్పథంతో ఆవిడ మాటల్ని అంతగా పట్టించుకునేవాణ్ణికాను.

'ఇదిగో... మిమ్మల్నే! లోకులు పలు కాకులు! అంతగా ఆవిడతో రాసుకుపూసుకు తిరగక్కర్లేదు! ఎవరికీ ఆవిడ సంగతి అక్కర్లేదుగానీ... మీకు మాత్రం కావలసి వచ్చిందే... నన్ను, నా అయిదుగురు పిల్లల్నీ అన్యాయం చేద్దామని అనుకుంటున్నారా? ఇంకా ముగ్గురమ్మాయిలకి పెళ్లిళ్లు చెయ్యాలి. మీకివేం బుద్ధులండీ... అయ్యో! రామచంద్రా...' నా శ్రీమతి మాటలు హద్దుమీరి... నన్ను వెక్కిరిస్తున్నాయి.




'అది తప్పే... యిన్నాళ్లూ నాతో కాపురం చేసి, యిదేనా నీవు నా తత్వాన్ని గ్రహించింది? ఈ బాధ వచ్చిందని తప్ప... అన్యమనస్కం కాకు... చూడు శంకరాచార్యులు కూడా ముప్పై రెండేళ్ల వయసులో ఇటు కేరళ నుంచి కేదార్ వరకు, అటు పూరీ నుంచి ద్వారక వరకూ దేశ సంచారం చేసి నాలుగు పీఠాల్ని నెలకొల్పి అన్యమతాల్ని తన వాదోపవాదాలతో ఖండించి అద్వైత విజయకేతనాల్ని ఆకాశంలోకి ఉవ్వెత్తుగా ఎగురవేసి జాతీయ సమైక్యతా భావాన్ని ఘనంగా చాటారే! మనం ఈ చిన్న విషయాల్లో వేరేలా ఆలోచించడం ఎంత సిగ్గు చేటు? ఇంకెప్పుడూ యిలాంటి మాటలు మాట్లాడకు...' అంటూ గట్టిగానే బుద్ధి చెప్పాను.

అలనాటి సంఘటనల్ని అలా తలచుకుంటూ ఆ రాత్రే బయలుదేరి నేను, నా శ్రీమతి కరుణగారింటికి వెళ్ళాలని నిశ్చయించుకుని, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి రాజమండ్రి చేరాం. అక్కణ్ణుంచి బస్సులో బయలుదేరి అమలాపురం చేరాం. మా ప్రయాణ బడలికనంతా కోనసీమ వాతావరణం పోగొట్టేసింది. ఆ కొబ్బరి తోటలు, తారురోడ్డు వెంబడి జరీఅంచులా వుండే ఆ కాలువలు, పసువు తోటలు, అరటితోటలు, ఓహ్...! నందనవనం గుర్తుకువచ్చింది.

ఆ శీతలవాయువుల వింజామరలకు మా హృదయాలు పరవశించాయి. పట్టణ కృత్రిమ వాతావరణం - వేశ్యవంటి తళుకు బెళుకులు! పల్లె సహజ వాతావరణం - ఉత్తమ గృహిణి వంటిది! నైసర్గిక శోభ - ఆ ప్రకృతి సోయగాలూ మనస్సు పరవశించిపోతూవుంది. జనియించినాడనే స్వర్గఖండమున అంటారు రాయప్రోలువారు. అది నిజమే మరి!

ఆ ప్రక్కగా పశువులమందలు, పాలికావు కుర్రవాళ్ళు... ఆ వెనుక మేకలమందలు, గొర్రెలమందలు మా బస్సుకు అడ్డంగా వచ్చాయి. బస్సు నెమ్మదిగా వాటిని తప్పించుకుని ముందుకు కదుల్తోంది. ఆ కాలువలో జలకా

లాటలాడే కుర్రకారు, స్నానాలు చేస్తున్న మగు వలు, మగవారు - ఎంత పరమానందం. పట్టణాల్లో తనివితీరా స్నానం చేయాలంటే భయం! నీళ్ళ కరువు!

మా బస్సు గమ్యస్థానం చేరింది. రిక్షా కట్టించుకుని కరుణగారింటికి చేరాం. పెంకు టిల్లు, ముందు చిన్నదొడ్డి. దానిలో పూల మొక్కలు... నాలుగు గదులు ఇల్లేమో! చక్కగా తీర్చిదిద్ది అందంగా అలంకరించబడిఉంది.

రిక్షా ఆగిన చప్పుడు విని పిల్లలు మమ్మల్ని చూసి తుర్రున లోపలికి పరిగెత్తారు.

'రండి! రండి! మీరు వస్తారో రారో అని అనుకుంటున్నాం! నేను కరుణ తమ్ముడు రాజారావుని! మాదగ్గరే... కాదు కాదు... ఆవిడ దగ్గరే... మేముంటున్నాం...' అంటూ మా సామాను తీసుకుని లోపలికి నడిచాడు. ఇంత లో రాజారావుగారి భార్య కాబోలు 'అన్నయ్య గారూ నమస్కారం! రండి! ఇదిగో ఇక్కడ నీళ్ళున్నాయి, ముందు కాళ్ళు కడుక్కోండి! అంటూ తువ్వాలు చేతపుచ్చుకుని నిల్చుంది.

మరలా రాజారావుగారు బయటకువచ్చి 'ఈమె నా ఇల్లాలు సరోజ... నాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల... ఒరేయ్ రామం, ఈశ్వర్, నీలిమా... ఇలా రండి' అంటూ వాళ్ల ముగ్గుర్నీ చూపించాడు.

మేము కాళ్ళు కడుక్కుని లోపలికి కదిలా ము. ఇల్లు చిన్నదైనా చూడముచ్చటగా ఉంది. మాకో గది కేటాయించారు. రెండు మడత మంచాలు, వాటిపై తెల్లని పక్కలు పరిచి ఉన్నాయి. పైన సరంబీ... ఫేన్ గాలికి ప్రాణం లేచివచ్చింది.

కరుణ కనబడలేదేమిటాని నా మనస్సు కంగారుపడుతోంది. అదే మాట రాజారావు గారిని అడిగేసాను ఉండబట్టలేక.


'ఆ ప్రక్కగదిలో వుందండీ! నోటమాట సరిగా రావడంలేదు. నీరసం, నిస్త్రాణ! చాలా జబ్బు చేసింది. ముందు మొహాలు కడుక్కుని, కాఫీ తాగి కుదుటపడండి... ఆవిణ్ణి చూద్దురు గాని... మిమ్మల్నే కలవరిస్తూ వుంది... అంటూ మాకు పేస్ట్ తేవడానికంటూ బయటకు కది లాడు.

మా సరంజామా మా దగ్గరే వుంది. 'ఏమీ వద్దులెండి'. అన్నీ మేం తెచ్చాకున్నాం...' అని లుంగీకట్టుకుని పేస్టు, బ్రష్‌తో దొడ్లోకి వెళ్లి, నూతి దగ్గరకు చేరాను. వెనుక విశాలమైన దొడ్డి, కూరగాయల తోట, కొబ్బరి చెట్లు, ఆహ్లా దకరమైన వాతావరణం! పళ్ళు తోముకుని నూతిలోని చల్లని నీళ్ళతో స్నానం చేసి బట్టలు మార్చుకున్నాను.

నా శ్రీమతిని సరోజగారు, నీలిమ చుట్టు ముట్టి వారి ఆదరణతో, ఆప్యాయతతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ఆవిడా స్నానాది కార్యక్ర మాలు ముగించుకుంది.

మేమిద్దరం, రాజారావుగారూ కరుణమ్మ గారున్న గదిలోకి ప్రవేశించాం.

పట్టెమంచం, పరుపు... అందులో ఒక మూలకు ఒదిగి పడుకొనివుంది ఆవిడ. చాలా శుష్కించిపోయింది. మమ్మల్ని చూడగానే ఒక్క సారి ఆనందపారవశ్యమైంది. చేతులు జోడిస్తూ ... 'వచ్చారా? ఇంక రారేమో అనుకుంటున్నా ... మీ కోసం నా కళ్లు కాయలు కాచాయంటే నమ్మండి! రోజూ మీకు ఫోన్ చేయమని నెత్తీ నోరూ మొత్తుకుంటూనే వున్నా. ఎలా ఉన్నారు? అమ్మాయి వచ్చిందా...? రా... నా దగ్గర ఇలా కూచోవమ్మా...' అంటూ కళ్ళవెంబడి నీళ్లు




వస్తూంటే... వాటిని తుడుచుకుంటూ నా శ్రీమతిని తనివితీరా అక్కునచేర్చుకుని, చెప్ప లేని తన్మయత్వంతో కాస్సేపు మౌనంగా వుండి పోయారు.

'ఏమిటండీ? ఎలా వుండేవారు, ఇలా అయిపోయారు. ఏమిటి ఈ అనారోగ్యం? యాత్రల్లో మాతో చకచకా నడిచేవారు అలుపు సొలుపూ లేకుండా... భోజనం చేసినా చేయక పోయనా... అసలు నీరసం లేకుండా హాయిగా తిరిగేవారు... అలాంటిది మీరీ స్థితికి వచ్చా రంటే నమ్మలేకున్నాం' అంటూ ఏవో ఉపశమన వాక్యాలు పలకడం మొదలెట్టాను.

మీరు పంపిన శుభలేఖలన్నీ అందుతూనే వున్నాయి. రావాలంటే దూరం... వీళ్ళకీ అంత తీరికలు లేవు... నా మనస్సా... అక్కడే పరిభ్ర మిస్తూ వుండేది. నా తమ్ముడు, పిల్లలు, సరోజా నన్ను ఆప్యాయంగా చూసుకుంటూనే వున్నారు. మరి వయస్సు ప్రభావం తప్పుతుందా...? మిమ్మల్ని చూస్తానో చూడలేనో అనే అధైర్యం పట్టుకుంది. మీరు వచ్చారు. నాకదే సంతోషం. ప్రయాణం బాగా జరిగిందా... అందరూ కులాసాగా ఉన్నారు కదా...!

సరే... టిఫిన్లు తినండి. అమ్మాయ్ సరోజా! వేడి వేడి పెసరట్లు, జీడిపప్పు ఉప్మా... వీళ్ళకి టిఫిన్. అది నేతితో చేయి... చాలా సంతోషం గా వుందండీ. ఇదిగో... ఈ కవరు మీకు అందించాలని నా తాపత్రయం... అంటూ ఓ కవరు నా చేతిలో పెట్టి, విశ్రాంతి తీసుకుం దుకు ఉపక్రమించి, కాస్సేపు మౌనంగా కళ్ళు మూసుకున్నారు.

మేము బయటకు కదిలాం. మా గదిలోకి వచ్చాం. కాసేపు నడుం వాల్చాం. అలా నడుం వాల్చామో లేదో ప్రక్కగదిలో గొల్లున ఏడ్పులు... కంగారుగా ఆ గదిలోకి పరిగెత్తాం. కరుణగారు తుదిశ్వాస విడిచారని గ్రహించాం. ఎవరికేది ఋణానుబంధమో తెలియదు... మా ఆవిడ చేతిలోని కవరులోంచి తొంగిచూస్తోంది అయిదులక్షల చెక్కు నా పేర... ●